క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత

ధర్మసాగర్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బీపీసీలో అక్షర 423, జాస్మిన్ 412, సుప్రియ 410 మార్కులను సాధించారు. ఎంపీసీలో ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో నవనీత్ 466, హర్షిత్‌సాయి 464 మార్కులను సాధించగా కొంతమంది రాష్ట్రస్థాయి మార్కులను సాధించారు. మణి ప్రీతమ్, హితేష్ 462 మార్కులు, ధాత్రి 461, మోజెస్, హర్షవర్ధన్ 457, ప్రణయ్ 454, రిషబ్ 452, సీఈసీలో మతం త్రివేణి 402, హెచ్‌ఈసీలో వాసవి 429 మార్కులను సాధించారు.

వయోవృద్ధులకు ఉచిత న్యాయ సహాయం



హన్మకొండ: వయోవృద్ధులు ఉచిత న్యాయ సలహా పొందేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే సూచించారు. హనుమకొండలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వయో వృద్ధులు తమ కుటుంబ సభ్యులతో అనేక రకాల వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సభ్యురాలు అనితారెడ్డి మాట్లాడుతూ తమ పిల్లలకు ఆస్తులు పంపిణీ చేసిన తర్వాతే పెద్దలపై వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి మాట్లాడుతూ వయోవృద్ధుల రక్షణకు తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టం -2007 ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యాంకుమార్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగందర్, వల్లంపట్ల నాగేశ్వర్ రావు, అంచూరి చంద్రమౌళి, చంద్రజిత్ రెడ్డి, దామెర నర్సయ్య, నర్సయ్య, మార్క రవేందర్ గౌడ్, తాడూరి లక్ష్మి నారాయణ, గంగారపు యాదగిరి, రాజేందర్, గంటి సాంబయ్య, చిదురాల సత్యనారాయణ, కజాంపురం దామోదర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సు

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సోమవారం ముగిశాయి. కడిపికొండ గ్రామంలో చివరి రోజు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు 232 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భావ్‌సింగ్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రణయ్, ఆర్ఐ కృష్ణ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రామన్నపేట: న్యూస్‌పేపర్ కొనుక్కొని వస్తానని చెప్పి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపిన వివరాల ప్రకారం గోపాలస్వామి సర్కిల్ సమీపంలో అద్దెకు ఉంటున్న రామగిరి వెంకటయ్య ఈనెల 15న మధ్యాహ్నం సమయంలో న్యూస్‌పేపర్ కొనుక్కొని వస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వెంకటయ్యకు కాస్త మతిస్థిమితం ఉందని, ఫిట్స్ కూడా వచ్చేదని కుటుంబీకులు తెలిపారు. ఎంత వెతికినా వెంకటయ్య ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 85117, 87126 85005 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

శ్రీపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

హన్మకొండ: రెవెన్యూ శాఖలో కర్రె శ్రీపాల్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి సంతాప సభ సోమవారం జరిగింది. ముందుగా శ్రీపాల్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, బంధు మిత్రులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తహసీల్దార్‌గా హనుమకొండలో శ్రీపాల్‌రెడ్డి తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. విధి నిర్వహణలో ఆయన చూపిన శ్రద్ధ గొప్పదన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు చాడ సునీల్ రెడ్డి, హనుమా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రజనీకర్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న 'పరిషత్' భవనం



మండల పరిషత్ కార్యాలయం



పెచ్చులూడిన మండల పరిషత్ కార్యాలయ భవనం

- బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ
- మీటింగ్‌హాల్‌కు తాళం వేసిన అధికారులు
- దృష్టిసారించని ఉన్నతాధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది భయంభయంగా కాలం వెల్లదీస్తున్నారు. కార్యాలయ భవనం 2006లో నిర్మించారు. కొంత కాలంగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది జంకుతున్నారు. భవనం పైన ఏర్పాటు చేసిన మీటింగ్ హాల్ మొత్తం పెచ్చులూడడంతో దానికి తాళం వేశారు. పక్కన ఉన్న మరో శిథిలమైన హాల్‌లోనే మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీపీ చాంబర్‌లో వాష్‌రూమ్ గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మండల పరిషత్ కార్యాలయంలో నిత్యం పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ,ఈజీఎస్ సిబ్బందికి ఎంపీడీఓ సమావేశాలు నిర్వహిస్తారు. అలాగే సర్వసభ్య సమావేశం జరుగుతుంది. అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏమౌతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా భవనాన్ని తొలగించి, నూతన భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. నూతన భవన నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి వారి దృష్టికి తీసుకెళ్తాను. వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ

కమిషనర్ సార్.. భరించలేకపోతున్నాం

- పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం
- ముక్కు మూసుకుంటున్న విద్యార్థులు



జెడ్పీ బాలికల పాఠశాల ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారం

పరకాల : చదువుకునేందుకు వస్తే పాఠశాల ఆవరణలో కాలనీవాసులు, దుకాణాదారులు వేస్తున్న చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థినులు అసహనం వ్యక్తం చేశారు. 'మున్సిపల్ కమిషనర్ సార్.. ఈ దుర్వాసన భరించలేకపోతున్నాం. చర్యలు తీసుకోండి' అంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో మధ్యాహ్న భోజనం కూడా తినలేక పోతున్నామని స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులు తెలిపారు. దుర్వాసతో ఇబ్బందులు పడుతుంటే మరోవైపు మున్సిపల్ సిబ్బంది వచ్చి చెత్తను తరలించకుండా కాల్చివేస్తున్నారని దీంతో ఊపిరి కూడా పీల్చుకోలేకపోతున్నామని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

పద్మశ్రీతో మాదిగలకు దక్కిన గౌరవం

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సోమన్న



మాట్లాడుతున్న సోమన్న

శాయంపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో మాదిగ జాతికి గౌరవం దక్కిందని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన ప్రత్యేక కార్యచరణను మండలంలోని ప్రతి గ్రామంలో అమలు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేసి జులై 7న ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని జన జాతరను మాదిగలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను ఆ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కోఇన్‌చార్జ్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్, ఎంఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు సుకుమార్, నాయకులు దేవయ్య, ముఖేష్, జగన్, సుమన్, క్రాంతికుమార్, రాజేందర్, రాజు, చిరంజీవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా భూ భారతి చట్టం అమలు



ఐనవోలు : రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్



శాయంపేట : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి
- మాదారంలో 249 అర్జీల స్వీకరణ

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తెలిపారు. పట్టణంలోని మాదారంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 249 అర్జీలను తహసీల్దాలర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో స్వీకరించినట్లు తెలిపారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించి వారి భూములపై పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కుమార్, ఎంఆర్ఐ దామోదర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. 230 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 1,971 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐలు రాణి, మల్లయ్య, సూరజ్, సత్యం పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో సోమవారం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల అందించిన 160 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఎమ్మార్వై రమేశ్‌ఖన్నా, ఏఎస్ఓ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది విజయ్, శశికాంత్, తులసి, మోహన్, సంపత్, రాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెత్త తొలగించిన పంచాయతీ సిబ్బంది



అంగన్‌వాడీ సెంటర్ ఎదుట చెత్త తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు కాలనీలో గల అంగన్‌వాడీ సెంటర్ ముందు చెత్త పేరుకుపోగా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో 'బ్యాంకు కాలనీలో కరువైన పరిశుభ్రత' అనే కథనాన్ని సోమవారం సాక్షి దినపత్రిక ప్రచురితం చేసింది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, సిబ్బంది చెత్త కుప్పలను తొలిగించారు. సాక్షికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో భాగంగా పూజ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్, పిల్లల తల్లులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్ఛరణల నడుమ పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ పద్మకుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తూ వారి నైపుణ్యాలు మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి క్రమశిక్షణ నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జ్యోతి, మధుమిత, తల్లుల కమిటీ సభ్యురాలు తుమ్మ స్వాతి, ఆయా ప్రమీల, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

పరకాల ప్రభుత్వ కాలేజీలో నీట్ కోచింగ్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా నీట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కొత్తగా 116 అడ్మిషన్లు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న మెరుగైన విద్యను, ఫలితాలను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి మంచి భవిష్యత్‌కు తోడ్పాడాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీలో చేర్పించాలని అన్నారు.

సంక్షిప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

ధర్మసాగర్ : మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పొందేందుకు రేపటి లోగా (ఈనెల 18వ తేదీ వరకు) దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రాజేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులు భూమి పట్టా పాస్‌బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను ఏఈఓలకు అందించాలని కోరారు. ఈనెల 5వ తేదీ వరకు పట్టా పాస్‌బుక్కులు పొందిన రైతులు అర్హులని తెలిపారు. ఇది వరకు రైతు భరోసా తీసుకుంటూ బ్యాంకు అకౌంట్ల మార్పు, చేర్పులు చేసుకునే రైతులు బ్యాంకు అకౌంట్ వివరాలను సంబంధిత ఏఈఓకు అందించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు



జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రైతు రక్షణ సమితి నాయకులు

నడికూడ : జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్‌ని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌల రామారావు, మాధవరావు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

ఐనవోలు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నందనం ఆకేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నడికూడ : మండలంలోని నడికూడ సబ్ స్టేషన్ పరిధిలోని గల చౌటుపర్తి, నడికూడకు మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ఇందూజ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌ల మరమ్మతులో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కమలాపూర్ : శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిగరం, గూనిపర్తి సబ్ స్టేషన్ల పరిధిలోని శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

కమలాపూర్ : విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏఈ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడీఈ 8712484610, ఏఈ 8712484606, సబ్ ఇంజనీర్ 8712484607, లైన్ ఇన్‌స్పెక్టర్ 8712484672, లైన్‌మెన్ (గూనిపర్తి) 8712484673, లైన్‌మెన్ (కమలాపూర్) 8712484585, లైన్‌మెన్ (గూడూరు) 8712484583, లైన్‌మెన్ (శనిగరం) 8712484584, సబ్ స్టేషన్ (కమలాపూర్) 8712484665, సబ్ స్టేషన్ (శనిగరం) 8712484605, సబ్ స్టేషన్ (గూనిపర్తి), 8712484604గా మారాయని, ఈ నంబర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండలంలోని నూర్జహాన్‌పల్లి గ్రామంలో శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. గ్రామస్తులకు బీపీ, షుగర్, జనరల్ పరీక్షలు చేసినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ప్రణవ్



కమలాపూర్ : సీఎం, మంత్రుల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రణవ్ తదితరులు

కమలాపూర్ / శాయంపేట /ఐనవోలు / ధర్మసాగర్ /నడికూడ : వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని ఆ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల వీడియో కాన్ఫరెన్స్‌ను కమలాపూర్ మండలంలోని వంగపల్లి, గూడూ రు రైతు వేదికల్లో ఏర్పాటు చేయగా సోమవారం ఆయన పాల్గొని వీక్షించారు. రైతులకు పెట్టుబడి సాయం రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే శాయంపేట మండల కేంద్రంలో రైతులు ఎవరూ హాజరు కాక పో వడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అదే విధంగా ఐనవోలులో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, గర్మిళ్లపల్లిలో ఏఓ సునీల్‌కుమార్, ఏఈఓ అనూష, రైతులు పాల్గొనగా.. ధర్మసాగర్ మండలంలో ధర్మసాగర్, పెద్ద పెండ్యాల, నారాయణగిరి రైతు వేదికల్లో సీఎం ప్రసంగాన్ని ఏఓ రాజేశ్, ఎంపీడీఓ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఏఈఓలు పవన్‌కల్యాణ్, హరీశ్, నవ్య, జయశ్రీ, దివ్య రైతులు వీక్షించారు. నడికూడ మండలంలోని రాయపర్తి, వరికోల్, నడికూడ, కంఠాత్మకూరు గ్రామాల్లో గల రైతు వేదికల్లో ఎంపీడీఓ విమల, ఎంపీఓ రవి, ఏఓ పోరిక జైసింగ్, ఏఈఓలు రైతులు వీక్షించారు. రైతు భరోసా నిధుల విడుదలపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. 27 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఆట, పాటల నడుమ గడిపారు. ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, సమ్మయ్య, కృష్ణమూర్తి, సుశీల, ఇందిరా విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మాట మీద కట్టుబడి ఉందని చెప్పారు. ఇళ్ల మంజూరుతో పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నట్లు వివరించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించాలని హనుమకొండ సర్కిల్ కార్యాలయం డీఈ (టెక్నికల్), భద్రతా అధికారి ఎ.విజేందర్ రెడ్డి సూచించారు. ఇటీవల మృతి చెందిన మెట్‌పల్లి డివిజన్ వల్గొండ సెక్షన్ ఏఎల్ఎం డంపేట రాజేశం, డోర్నకల్ ఏఎల్ఎం క్రాంతికి హనుమకొండ నక్కలగుట్టలోని హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ అధికారులు, ఉద్యోగులు సోమవారం 2 నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విధుల్లో ఉన్నప్పుడు భద్రతా పరికరాలు వాడాలన్నారు. అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు పోగొట్టుకోవద్దని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.